# సెల్లార్.. C/o కమర్షియల్!


సెల్లార్‌లో నిర్వహిస్తున్న వ్యాపారాలు



సెల్లార్‌లో నిర్వహిస్తున్న ద్విచక్రవాహనాల సర్వీస్ సెంటర్

- పార్కింగ్‌కు అనుమతివ్వని దుకాణదారులు
- వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వైనం
- రోడ్లపై వాహనాల పార్కింగ్
- రద్దీ వేళ ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

**గోపాలపట్నం:** వాహనాల పార్కింగ్‌కు ఉపయోగించాల్సిన సెల్లార్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. మరికొంత మంది దుకాణదారులు, భవన యజమానులు వాటిని అద్దెలకు ఇచ్చేస్తున్నారు. దీంతో వాహన చోదకులు రోడ్డుపై పార్కింగ్ చేస్తుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.గోపాలపట్నం మెయిన్ రోడ్డులోని కొన్ని వస్త్ర దుకాణాల్లో సెల్లార్లను ఉద్యోగుల లాకర్లు, టైలరింగ్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. మరో చోట సర్వీసింగ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. బుచ్చిరాజుపాలెంలో కూడా దుకాణదారుడు సెల్లార్‌లో సర్వీసింగ్ సెంటర్ నడుపుతున్నాడు. కార్లు పార్కింగ్ చేసినప్పుడు రోడ్డు సగం వరకు ఆక్రమించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది.

### సర్వే ఏమైంది?

**గతంలో ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. ఈ సర్వేలో** అనుమతులు ఉన్న భవనాలు ఎన్ని, లేనివి ఎన్ని అని పరిశీలించారు. వాటి ద్వారా సెల్లార్ల ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. వాణిజ్యానికి వినియోగిస్తున్న వాటిని పార్కింగ్‌కు కేటాయిస్తామని ప్రకటించినా అది కార్యరూపం దాల్చలేదు. దీంతో సెల్లార్లను వ్యాపారాలకు వినియోగిస్తున్నారు.

### గతంలో నోటీసులు ఇచ్చాం

గతంలో సెల్లార్లపై సర్వే చేశాం. పలవురు దుకాణదారులకు నోటీసులు ఇచ్చాం. మరో మారు పరిశీలించి చర్యలు చేపడతాం. సెల్లార్ల ఆక్రమణలను ఉపేక్షించబోం. ఏ ఉద్దేశంతో సెల్లర్లు ఉన్నాయో వాటికే ఉపయోగించాలి.

– రామలింగేశ్వరరెడ్డి, ఏసీపీ, జోన్–8 టౌన్ ప్లానింగ్


తాళం వేసిన సెల్లార్


గోపాలపట్నంలో ప్రధాన రహదారిపై వాహనాల పార్కింగ్

## క్లుప్తంగా

### సర్టిఫికెట్ల అందజేత


సర్టిఫికెట్లు అందుకున్న వారితో రేవళ్ల సత్యనారాయణ

**మల్కాపురం:** మహిళలు వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి సాధించాలని జీవీఎంసీ 59వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ అన్నారు. 59వ వార్డు హిమాచల్‌నగర్ ప్రాంతంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సోమవారం ఆయన సర్టిఫికెట్లు అందించారు. సొంతంగా షాపులు పెట్టుకుని పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మహిళలకు శిక్షణ ఇచ్చిన కాకి గౌరీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు పెద్దిరాజు,సరోజ తదితరులు పాల్గొన్నారు.

### గొప్ప సంఘసంస్కర్త సావిత్రి బాయి పూలే


సమావేశంలో పాల్గొన్న భాగ్యలక్ష్మి, విద్యార్థులు

**మల్కాపురం:** సావిత్రిబాయి పూలే బాల్యవివాహాలు, సతీ సహగమనం,అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారని.. స్త్రీ విద్యకు బాటలు వేశారని ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. సాయిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా సంక్షేమానికి స్థాయిత్రిబాయి పూలే చేసిన సేవలను ఆమె గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రొగ్రాం అధికారి వై.అనసూయాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి


విద్యార్థులకు అట్టలు, ఇతర సామగ్రి పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ గణబాబు

**మల్కాపురం:** విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని ప్రభుత్వ విప్ గణబాబు అన్నారు. 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్‌ను సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాపురం ఉన్నత పాఠశాలకు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థాయి గుర్తింపు ఉందన్నారు. ఈ ఏడాది కూడా నిలబెట్టాలని సూచించారు. వార్డు టీడీపీ పార్టీ అధ్యక్షుడు మజ్జి సోమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమణికుమారి తదితరులు పాల్గొన్నారు.

### పోలీస్ బ్యాండ్ గదుల ప్రారంభం


నూతన గదులను ప్రారంభించిన సీపీ బాగ్చీ

**విశాఖ సిటీ:** పోలీస్ బ్యాండ్ కోసం పోలీస్ బ్యారెక్స్‌లో నూతనంగా నిర్మించిన గదులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ప్రారంభించారు. పోలీస్ కార్యక్రమాలు, పలు జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలకు బ్యాండును అందించేందుకు 19 మంది సభ్యులతో పోలీస్ బ్యాండ్ ఉంది. సీపీ గతంలో ఆర్మడ్ రిజర్వ్ పర్యటనలో నగర పోలీసు బ్యాండు గది శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో అదే ప్రాంగణంలో నూతన గదులను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. వెంటనే గదులను నూతనంగా నిర్మించారు. బ్యాండ్ ప్రాక్టీస్ కోసం ఒక గదిని, వారు ఉండేందుకు మరో ఏసీ గదిని సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో నగరంలో పోలీస్ సంబంధిత కార్యక్రమాలకే కాకుండా, అంతర్జాతీయ కార్యక్రమాలకు అనువుగా బ్యాండ్ నిర్వహించేందుకు అవసరమైన సంగీత పరికరాల కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే పదవీ విరమణ చేసిన వారి స్థానంలో కొత్తగా హోంగార్డులను నియమించేందుకు అధికారులకు లేఖ రాస్తానన్నారు.

### అభివృద్ధి పనుల పరిశీలన


వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

**విశాఖ విద్య:** జీవీఎంసీ 52వ వార్డు గ్రీన్ బెల్ట్‌లోని వాకింగ్ ట్రాక్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం అధికారులతో కలసి నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. మర్రిపాలెం వుడా లే అవుట్ ప్రాంతంలో పాస్‌పోర్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న గ్రీన్‌బెల్ట్ లో మోడల్ లైటింగ్, బ్యూటిఫికేషన్, వాటర్ సప్లై మొదలైన పనులు చేపట్టారు. అలాగే వుడా లేఅవుట్ కమ్యూనిటీ హాల్ ఎదురుగా చిల్డ్రన్ పార్క్ అభివృద్ధి కోసం అధికారులతో చర్చించారు. పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఏఈ ఉష తదితరులు పాల్గొన్నారు.

### సెప్టిక్ ట్యాంకుల శుభ్రం

**సింథియా:** జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలోని ప్రభుత్వ గృహ సముదాయాల్లో సెప్టిక్ ట్యాంక్‌లు నిండి దుర్వాసన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విషయం తెలుసుకున్న 40వ వార్డు బీజేపీ అధ్యక్షురాలు మేఘనదుర్గ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సోమవారం యుద్ధప్రాతిపదికన జీవీఎంసీ సిబ్బంది సెప్టిక్ ట్యాంకులను క్లీనింగ్ చేయించి సమస్యను పరిష్కరించారు.

## ఇళ్ల స్థలాలివ్వాలని ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

**మల్కాపురం:** నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మాణానికి అవసరమైన నగదు ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు గండి అప్పారావు, జిల్లా నాయకుడు గుడాల రాంబాబు అన్నారు. ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ములగాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ మల్కాపురం జోన్ కమిటీ నాయకులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు భూమితో పాటు ఇంటిని నిర్మించుకునేందుకు అవసరమైన నగదును ప్రభుత్వమే ఇస్తుందని ఎన్నికల ముందు హామీలు ఇచ్చారన్నారు. దీనిపై నేడు నిరుపేదలు ప్రశ్నిస్తుంటే కూటమి పాలకులు పొంతన లేని సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. అలాగే టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు తక్షణమే అప్పగించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ భుజంగరావుకు వినతి పత్రం అందజేశారు.

## ప్రజాసమస్యలపై సీపీఎం ఇంటింటి సర్వే


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సీపీఎం నాయకుడు జగ్గునాయుడు

**సింథియా:** ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను సోమవారం జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, దీర్ఘకాలిక సమస్యలపై ఇంటింటి సర్వే చేస్తున్నామన్నారు. ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, రేషన్‌కార్డులు, ఇంటి పన్నులు, మంచినీరు, విద్యుత్ స్తంభాలు, రోడ్లు, కాలువలు వంటి పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. వినతులు అధికారులకు అందజేస్తామని.. స్పందించకుంటే నిరసనలు, ధర్నాలు చేపట్టి సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 2 వినతులు


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

**కంచరపాలెం:** జీవీఎంసీ జోన్–5 జ్ఞానాపురం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 2 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బి. రాము వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. రెవెన్యూ విభాగానికి 1, పబ్లిక్ హెల్త్ విభాగానికి 1 వినతి అందినట్లు జెడ్సీ రాము తెలిపారు. పరిష్కార వేదికలో వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించాలన్నారు. జోన్ పరిధిలో టౌన్‌ప్లానింగ్‌పై అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని, వార్డు పర్యటనలో అధికారులు విధిగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారాప్రసన్నరెడ్డి, డీఈ రామ సుబ్బారావు, పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్‌ప్లానింగ్ టీపీవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏయూ విద్యార్థికి పురస్కారం

- పరిశోధన పత్రాల్లో కేతన్ ప్రాజెక్ట్‌కు ప్రథమస్థానం
- ఐఈఈఈ సదస్సులో బహూకరణ


కేతన్‌రెడ్డిని అభినందిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

**విశాఖ విద్య:** ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ విభాగానికి చెందిన బీటెక్ రెండో సంవత్సర విద్యార్థి ఆళ్ల కేతన్ రెడ్డి అరుదైన ఘనత సాధించారు. డీఆర్‌డీవో (ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్, బాలాసోర్, ఒరిస్సా) ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సులో ఉత్తమ పరిశోధనా పత్ర పురస్కారాన్ని అందుకున్నాడు. ఎలక్ట్రానిక్ ఆడియో తరంగాలలో ఉన్న అనవసర శబ్దాలను తొలగించడానికి డినొయిసింగ్ సాంకేతికతను తయారుచేసిన కేతన్ రెడ్డి ప్రాజెక్ట్ మొదటి స్థానం పొందడంతో ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు కేతన్‌రెడ్డిని సోమవారం అభినందించారు. ప్రతిష్టాత్మక వర్సిటీల నుంచి వచ్చిన వంద పరిశోధనా పత్రాల్లో ఏయూ విద్యార్థి పరిశోధన ప్రథమ స్థానంలో నిలవడం, డీఆర్‌డీవో సదస్సులో పురస్కారం అందుకోవడం గర్వకారణమని ప్రశంసించారు.

## బీఎడ్ మూల్యాంకన కేంద్రం పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు

**విశాఖ విద్య:** ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిధిలోని బీఎడ్ ప్రశ్నాపత్రాల మూల్యాంకనం జరుగుతున్న కేంద్రాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు సోమవారం పరిశీలించారు. యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల పరిధిలో 57 కళాశాలలకు సంబంధించిన బీఎడ్ మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ఏయూలో జరుగుతోంది. ఈ సందర్భంగా మూల్యాంకనాన్ని పరిశీలించిన ఆయన విద్యావిభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజుతో మాట్లాడి, పలు విషయాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నగరాజకుమారి ఉన్నారు.


### విజేతలకు అభినందన


బాక్సింగ్‌లో సత్తా చాటిన చిన్నారులతో మైక్ టైసన్ టీమ్

**మల్కాపురం:** ఈ నెల 8న గంగవరంలో జరిగిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన చిన్నారులను అభినందించారు. గుల్లలపాలెం వాకింగ్ పార్కు వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో కోచ్‌లు మజ్జి రమేష్,ప్రసాద్ మాట్లాడుతూ మైక్ టైసన్ క్లబ్ నుంచి సుమారు 20 మంది పలు విభాగాల్లో జరిగిన బాక్సింగ్ పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించారని చెప్పారు. వారందరినీ సత్కరించారు.

## సమాచార భద్రత ఎంతో కీలకం

- సైబర్ చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి
- ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్



వర్చువల్ కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య రాజశేఖర్

**విశాఖ విద్య:** సైబర్ చట్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంపొందించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, ఏయూ న్యాయ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న వారం రోజుల ఫ్యాకల్టీ అఫ్లేషన్ ప్రొగ్రాం (ఎఫ్‌యూపీ)ను సోమవారం ఆయన వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ సమాచార గోప్యత అనేది ఎంతో కీలకమని చెప్పారు. సాంకేతిక, న్యాయ నిపుణులు సమష్టిగా పనిచేస్తూ సైబర్ భద్రతను పెంపొందించే విధంగా కృషి జరగాలని సూచించారు. భారతదేశంలో ప్రతి నిమిషం వందలాది సైబర్ దాడులు చోటు చేసుకుంటున్నాయని, ఇది సమస్య తీవ్రతకు అద్దం పడుతోందని చెప్పారు. విద్యావంతుల్లో సైతం సైబర్ చట్టాలపై అవగాహన కొరవడిందన్నారు. న్యాయ విద్యార్థులు ముఖ్య భూమిక పోషిస్తూ ప్రజలను ఈ దిశగా చైతన్యవంతం చేయాలని సూచించారు. సమ్మిళిత ఆలోచనలతో పని చేస్తూ సమర్థవంతమైన పరిష్కారాలను అందించాల్సిన అవసరాన్ని వివరించారు.

## జాతీయ రహదారిపై యువకుల విన్యాసాలు


ఎన్ఏడీ–గాజువాక దారిలో నిలిచిన వాహనాలు

- స్తంభించిన ట్రాఫిక్
- నచ్చచెప్పిన ట్రాఫిక్ పోలీసులు

**విశాఖ విద్య:** ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డుపైనే విన్యాసాలు చేశారు. గమనించిన ఆర్టీసీ డ్రైవర్ వారిని అడ్డగించి మందలించడంతో సదరు యువకులు హల్ చల్ చేశారు. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ కిలోమీటరు మేర స్తంభించింది. ఎన్ఏడీ నుంచి గాజువాక వెళ్లే దారిలో కాకానినగర్ వద్ద సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం నుంచి గాజువాక వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు ఇదే మార్గంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న యువకులు తరచూ అడ్డం వస్తుండడంతో వారిని డ్రైవర్ మందలించాడు. అయినప్పటికీ వారు ఏమాత్రం ఖాతరు చేయకుండా బర్మా క్యాంప్ నుంచి ఎన్ఏడీ ట్రాఫిక్‌సిగ్నల్ దాటేంత వరకు ప్రతీ సిగ్నల్ పాయింట్ వద్ద బస్సు పక్క నుంచి డివైడర్ వైపు సందులోంచి ద్విచక్రవాహనంతో ముందుకు వెళ్లేవారు. ఈ పరిణామాలతో ఎక్కడ ప్రమాదం సంభవిస్తుందోనని ఆర్టీసీ డ్రైవర్ ఆందోళనతో బస్సు నడపాల్సి వచ్చింది. ప్రతీ సిగ్నల్‌పాయింట్ వద్ద సదరు యువకులు ఇబ్బందికరంగా డ్రైవ్ చేయడంతో తీవ్ర అసహనం చెందిన ఆర్టీసీ డ్రైవర్ వారిని ఎన్ఏడీ సిగ్నల్ పాయింట్ దాటాక అడ్డగించాడు. డ్రైవింగ్ ఇష్టానుసారంగా చేస్తున్నారని నిలదీశాడు. ఆ యువకులు తమ తప్పులేదని డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో జాతీయ రహదారిపై ఇరువైపులా కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ట్రాఫిక్‌పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఇరువురిని సముదాయించి వారిని అక్కడ నుంచి పంపించేశారు. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## హయ్యర్ పెన్షన్ సాధించే వరకూ పోరాడుతాం


సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్స్ సంఘం ప్రతినిధి నూకరాజు

**మల్కాపురం:** ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో పని చేసి ఉద్యోగ విరమణ అయిన అర్హులందరికీ హయ్యర్ పెన్షన్ వర్తింపజేయాలని ఏపీ రిటైర్డ్ పెన్షనర్స్ సంఘం ప్రతినిధి నూకరాజు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో పని చేసి పదవీ విరమణ పొందిన వారికి హయిర్ పెన్షన్ వర్తింజేసి.. షిప్‌యార్డ్‌లో పదవీ విరమణ పొందిన వారికి వర్తించకపోవడం అన్యాయమన్నారు. మల్కాపురం సీఐటీయూ కార్యాలయంలో సోమవారం షిప్‌యార్డు పెన్షనర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెన్షనర్స్ పట్ల పాలకులు, అధికారులు వ్యవహరిస్తున్న తీరు బాధాకరంగా ఉందన్నారు. ప్రస్తుతం వస్తున్న పింఛన్ ఎందుకూ సరిపోవడం లేదన్నారు. హయ్యర్ పెన్షన్‌ను తక్షణమే అమలు చేయాలని.. లేని పక్షంలో ఏ పోరాటానికైనా సిద్ధం అని ప్రకటించారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు,సంఘం నాయకులు పాల్గొన్నారు.


## రూ.4వేల పెన్షన్ వర్తింపజేయాలి

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల డిమాండ్


నిరసన తెలుపుతున్న ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

**సీతమ్మధార:** ప్రభుత్వం వృద్ధులకు ఇస్తున్న పింఛన్ మాదిరిగానే ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రూ.4 వేలు పెన్షన్‌ను ఇవ్వాలని ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఏవీ రావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వీవీకే రాయ్, ఉపాధ్యక్షులు సీహెచ్. పైడిరాజు రెడ్డి, బొడ్డేటి జగతరావు డిమాండ్ చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖ రీజియన్ నేతృత్వంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద భారీ నిరసన చేపట్టారు. పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించినప్పటికీ స్పందన లేదన్నారు. కనీసం వృద్ధులకు ఇస్తున్న రూ.4వేలు పెన్షన్ అయినా వర్తింపజేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి ఈ నెల 14న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టి ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేయనున్నామని వెల్లడించారు.

## ఏపీఈఏ వైస్ చైర్మన్‌గా పరమేశ్వరరావు



**ఎంవీపీకాలనీ:** ఏపీ ఎకనామిక్ అసోసియేషన్ (ఏపీఈఏ) వైస్ చైర్మన్‌గా ఆచార్య కె.పరమేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగం విశ్రాంత ఆచార్యుడైన ఆయనకు విజయవాడలోని సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఇటీవల జరిగిన అసోసియేషన్ 41వ వార్షిక సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందజేసినట్లు ఆయన సోమవారం తెలిపారు. ఆచార్య పరమేశ్వరరావు గతంలో ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ (ఐఈఏ)కు కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సేవలు అందించారు.

### కాలుష్య నియంత్రణకు సహకరించండి

**దాబాగార్డెన్స్:** కాలుష్య నియంత్రణకు సహకరిస్తూ ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణాను వినియోగించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. ఆమె సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణాపై ఉపయోగిస్తున్నారన్నారు.